## క్లుప్తంగా

### యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనండి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



**తెనాలిఅర్బన్:** యోగాంధ్ర కార్యక్రమాలలో అందరు పాల్గొనాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా పట్టణంలోని అనేక ప్రాంతాలలో యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం మార్కెట్‌లోని అన్నాబత్తుని సత్యనారాయణ పురవేదిక వద్ద 500 మంది విద్యార్థులతో యోగాంధ్ర ఆకృతిని ప్రదర్శించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

### విద్యుత్ ఆదాలత్ సద్వినియోగం చేసుకోవాలి



**తెనాలి టౌన్:** జూన్ 20న రేపల్లే నిర్వహించే విద్యుత్ అదాలత్‌ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.వి.చిరంజీవి సూచించారు. బుధవారం స్థానిక చేంచుపేటలోని విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ.ఈ.,డి.ఈ., ఎస్సీ ఈ పరిధిలో పరిష్కారం గాని విద్యుత్ సమస్యలు వినియోగదారులు ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే వేదికలో పరిష్కరించుకోవచ్చునని సూచించారు. రిటైర్డ్ జడ్జ్ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

### డయేరియా నియంత్రణపై అవగాహన

**ఫిరంగిపురం:** డయేరియాపై ప్రజలకు అవగాహన అవసరమని వైద్యాధికారి శ్వేత అన్నారు. మండలంలోని 113 తాళ్లూరు, శిరంగిపాలెం, తక్కెళ్లపాడు, అమీనాబాద్, వేములూరిపాడు, ఫిరంగిపురం, రేపూడి, గొల్లపాలెం గ్రామాల్లో డయేరియా నియంత్రణపై బుధవారం ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వేడినీరు తాగాలని, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. డయేరియా వ్యాధికి గురైన వారు త్వరగా నీరసించి పోతారని.. చిన్నారులు పాలు తాగేందుకు ఆసక్తి చూపరని చెప్పారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీటిలో కలిపే విధానం, దానిని వయస్సుల వారీగా వాడుకునే పద్ధతి గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్ షేక్ అబ్దుల్ రెహామాన్, హెచ్‌వీ అన్నమేరి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### వైభవంగా వాసవీమాత ఆలయ వార్షికోత్సవం



**ఫిరంగిపురం:** మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి, నగరేశ్వర స్వామి ఆలయ ఏడో వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు రాజేంద్రశర్మ ఆలయ ముఖమండపంలో గణపతిపూజ, మండపారాధన, పుణ్యాహావాచనం, అఖండస్థాపన, నవగ్రహ మండపారాధన, ప్రధాన కలశావాహన పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. శ్రీసిద్ధి, బుద్ధి సమేత గణపతిస్వామి, వల్లీ దేవసేనా సమేత కుమారస్వామి, వింధ్యావాసినీ సమేత నగరేశ్వరస్వామి వార్లకు శాంతి కల్యాణాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలో ఉంచి గీతాభజన మండలి ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ డి.నరేంద్రకుమార్, కొత్తమాసు వెంకటేశ్వర్లు, మధులు పర్యవేక్షించారు.

### బస్‌పాస్‌లకు నగదు ఇవ్వొద్దు

**తెనాలి అర్బన్:** ఆర్టీసీ డిపో పరిధిలో బస్ పాస్‌లకు విద్యార్థులు ఎటువంటి నగదు ఇవ్వాల్సిన అవసరం లేదని మేనేజర్ ఎ.రాజశేఖర్ బుధవారం తెలిపారు. ఎవరైనా అడిగితే ఫోన్ నంబరు 73827 02492కు తెలియజేయాలన్నారు.

### సేవలపై అవగాహన


**మంగళగిరి టౌన్:** కిల్కారి మొబైల్ సేవలను వినేలా గర్భిణులు, బాలింతల్లో అవగాహన కల్పించాలని కిల్కారి ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజు అన్నారు. మంగళగిరి మండల పరిధిలోని నూతక్కి యూపీహెచ్‌సీలో కిల్కారి కాల్స్‌పై ఆశాలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందికి బుధవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. గర్భిణిగా ఉన్న 4వ నెల నుంచి బిడ్డ పుట్టిన ఏడాది వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై కిల్కారిలో అవగాహన కల్పిస్తారని.. ఇది పూర్తిగా ఉచితమని తెలిపారు.

# అగమ్యగోచరంగా షాదీఖానాలు

- టీడీపీ హయాంలో ఎన్నికల ముందు హడావిడిగా శంకుస్థాపన
- పనులు పూర్తికి కొరవడిన శ్రద్ధ
- వివిధ దశలో నిలిచిన ఏడు షాదీఖానాల పనులు
- పూర్తిచేయించాలని కోరుతున్న ముస్లింలు



పెదరావూరులో అసంపూర్తిగా ఉర్దూఘర్-షాదీఖానా



తూములూరులో శ్లాబ్ పూర్తయిన షాదీఖానా



నందివెలుగులో పిల్లర్లకే పరిమితమైన షాదీఖానా

**తెనాలి:** నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీల కోసం షాదీఖానాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఎన్నికలకు కొన్ని నెలల ముందు హడావుడిగా చేపట్టిన షాదీఖానాల పూర్తికి నాటి టీడీపీ ప్రభుత్వ పాలకులు తగిన శ్రద్ధ తీసుకోనేలేదు. ఫలితంగా ఆయా షాదీఖానాలు నిర్మాణాలు వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా వీటిపై దృష్టిపెట్టినట్టు కనిపించటం లేదు. ప్రస్తుత ప్రజాప్రతినిధులు షాదీఖానాలను నిర్మాణాన్ని పూర్తిచేసి ముస్లిం సమాజానికి ఉపయోగపడేలా చూడాలని ఆయా గ్రామాలకు చెందిన ముస్లిం మైనార్టీలు కోరుతున్నారు.

పేద, మధ్యతరగతి ముస్లిం మైనార్టీల కోసం ఉర్దూఘర్-షాదీఖానాల నిర్మాణాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ హయాంలో నాటి నియోజకవర్గంలో ఏడు షాదీఖానాల నిర్మాణానికి పూనుకున్నారు. వీటిలో ఉర్దూఘర్-షాదీఖానాతోపాటు కొన్ని కేవలం షాదీఖానాల వరకు మాత్రమే ఉన్నాయి. తెనాలి పట్టణంలోని పాండురంగపేటలో, రూరల్ మండలంలోని నందివెలుగు, పెదరావూరు, కొల్లిపర మండలంలోని కొల్లిపర, మున్నంగి, దావులూరు, తూములూరులో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ ఫండ్ పుండి షాదీఖానాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అదికూడా 2019 అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు మాత్రమే. 2018 చివర్లో అప్పటి తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ వీటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

షాదీఖానాల నిర్మాణానికి శంకుస్థాపన జరిగి, పనులు ఆరంభించినా నిర్ణీత వ్యవధిలో పూర్తిచేసి ముస్లింలకు అందుబాటులో ఉంచేందుకు చిత్తశుద్ధి కరవైంది. దీనితో ఆయా నిర్మాణ పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. పెదరావూరు, దావులూరు, తూములూరు గ్రామాల్లో షాదీఖానాల నిర్మాణం 60-70 పనులు పూర్తయ్యాయి. ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, అల్మరాలు, విద్యుత్ సౌకర్యం వంటి పనులు మాత్రమే ఆగిపోయాయి. తెనాలి పట్టణం పాండురంగపేటలోని ఏపీజే అబ్దుల్ కలామ్ షాదీఖానా, కొల్లిపర షాదీఖానాల్లో గ్రౌండ్‌ఫ్లోర్ పనులు జరిగిన, పై అంతస్తు నిర్మాణం కావల్సివుంది. తెనాలి మండల గ్రామం నందివెలుగులో కేవలం పిల్లర్స్ నిర్మాణం మాత్రమే పూర్తయింది. మరో కోటి రూపాయలు వెచ్చిస్తే అన్ని షాదీఖానాల పనులు పూర్తయి, ముస్లిం మైనారిటీలకు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఉంది. స్థానిక ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ ఇప్పుడు రాష్ట్ర మంత్రివర్గంలో సభ్యుడిగా ఉన్నారు. 2014-19లో తెనాలి ఎమ్మెల్యేగా షాదీఖానాలకు శంకుస్థాపన చేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఇప్పుడు ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఉన్నారు. ఇప్పుడైనా అసంపూర్తిగా ఉండిపోయిన షాదీఖానాలకు నిధులు రాబట్టి, పూర్తిచేయించాలని ప్రజాప్రతినిధులను ముస్లిం సోదరులు కోరుతున్నారు.

#### రూ.కోటి నిధులతో పూర్తిచేయవచ్చు



నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న షాదీఖానాల నిర్మాణ పనులను ఇప్పటికైనా పూర్తిచేయాలి. మొత్తం ఏడు షాదీఖానాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. కోటి రూపాయల నిధులు మంజూరు చేయిస్తే సరిపోతుంది. అన్ని షాదీఖానాలు అందుబాటులోకి వస్తాయి. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. – **షేక్ ఖలీల్**, ముస్లిం మైనారిటీ నేత, తెనాలి

#### త్వరగా అందుబాటులోకి తేవాలి



రూరల్ మండల గ్రామం పెదరావూరులో ముస్లింల కోసం చేపట్టిన షాదీఖానా అరవై శాతం పూర్తయింది. తర్వాత పనులు ఆగిపోయాయి. ఏళ్ల తరబడి అలా ఉంటే దెబ్బతింటాయి. మిగిలిన పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తే, ముస్లిం సమాజానికి ఉపయోగంగా ఉంటుంది. – **షేక్ సలాం**, పెదరావూరు

#### పిల్లర్లకే పరిమితం చేశారు



రూరల్ మండల గ్రామం నందివెలుగులో షాదీఖానా నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. పునాది వేసి, పిల్లర్ల నిర్మాణంతోనే పనులు ఆగిపోయాయి. ఏళ్లతరబడి పిల్లర్లకే పరిమితమైంది. షాదీఖానా అందుబాటులోకి వస్తుందని ఎదురుచూసిన మాకు నిరాశే మిగిలింది. ఇప్పుడైనా నిధులు తీసుకొచ్చి నిర్మాణం పూర్తిచేయించాలి. – **అజ్మతుల్లా**, నందివెలుగు

## స్మార్ట్ మీటర్లతో కార్మికులకు షాక్

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కేబీ ప్రసాద్



మాట్లాడుతున్న కేబీ ప్రసాద్

**తెనాలి:** విద్యుత్ రంగంలో ఆదాని స్మార్ట్ మీటర్ల ద్వారా పాలకులు అప్రకటిత సంస్కరణలు అమలు చేయాలని చూస్తున్నారనీ, వీటి ప్రభావంతో రాబోయే రోజుల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్స్ స్కీం కార్మికుల జీవితాలు దుర్భరంగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం యూనియన్ గౌరవ అధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. కేబీ ప్రసాద్ మాట్లాడుతూ, కరువు భత్యం అమలు జరగని కార్మికులకు పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా వేతనాలను ప్రభుత్వం చెల్లించదని చెప్పారు. స్మార్ట్ మీటర్లతో విద్యుత్ చార్జీల పెంపు భారాన్ని ప్రజలు మోయాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యుత్ చార్జీల పెంపు జరిగితే అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పాటు ఇంటి అద్దెలు కూడా పెరుగుతాయని గుర్తు చేశారు. దీంతో కార్మికుల అప్పుల ఊబిలో కూరుకుపోయి వారి జీవితాలు దుర్భరంగా మారతాయని చెప్పారు. కార్మిక వర్గానికి స్మార్ట్ మీటర్లు స్మార్ట్‌గా కాకుండా షాకిచ్చే మీటర్లుగా మారతాయనీ, వీటికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎం.దుర్గా ప్రసాద్, వి.లక్ష్మీనారాయణ, ఎం.నాగేశ్వరరావు, గోపి, శ్రీనివాసరావు, భాస్కర్, సుధాకర్, మరియమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనే ప్రధాని ధ్యేయం



మాట్లాడుతున్న సందీప్

**తెనాలి టౌన్:** పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రధాని నరేంద్ర మోదీ 11 సంవత్సరాలు పరిపాలన పూర్తి చేసుకున్నారని ఎ.సందీప్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మారీసు పేట బీజేపీ కార్యాలయంలో వికసిత్ భారత సంకల్ప సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ సేవలు, ఉద్దేశ్యాలు లక్ష్యాలు పథకాలు తెలియజేశారు, వికసిత్ భారత్ ద్వారా రానున్న 2047ని లక్ష్యంగా దేశంలోని పేదరిక నిర్మూలన, డిజిటల్ అక్షరాస్యత్తా, మేకిన్ ఇండియా, బేటీ పడావో-బేటీ బచావో వంటి పథకాలు, అందరికీ బ్యాంకు అకౌంట్ జన్ ధన్‌యోజన ద్వారా లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు కు నగదు బదిలీ.. ఇలా మెరుగైన పారదర్శక పాలన అందించిన ఘనత మోదీకి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎ.స్వరూప రాణి, కె.వాసుదేవ, ఎం.కనక దుర్గ, ఎం.హరికృష్ణ, బిట్ర కనక దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## జెండా చెట్టు ఏర్పాటు విరమించుకోవాలి

నరేంద్ర దేవ్ కాలనీ వాసుల ఆందోళన



ఆందోళన చేస్తున్న నరేంద్ర దేవ్ కాలనీ వాసులు

**తెనాలిఅర్బన్:** బుర్రిపాలెం రోడ్డులోని జెండా చెట్టును తమ కాలనీలో ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని మున్సిపల్ అధికారులు ఉపసంహరించుకోవాలని నరేంద్ర దేవ్ కాలనీ వాసులు కోరారు. జెండా చెట్టు ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేసేందుకు బుధవారం కొందరు ముస్లిం మత పెద్దలు కాలనీకి రావడాన్ని గమనించిన వారు అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఇక్కడి నుంచి వెళ్ళిపోవాలని కోరారు. దీంతో వారు వెనుతిరిగారు. ఈసందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా బుర్రిపాలెం రోడ్డు మధ్యలో ఉన్న జెండా చెట్టును తమ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని అధికారులు భావించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎస్సీ, ఎస్టీలు నివశించే ప్రాంతంలో దీనిని ఏలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఈ విషయాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళ్ళి అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి రమణమ్మ, చేవూరి శ్రీనివాసరావు, తుమ్మల రమేష్, చొక్కాకుల బోసు, కందుకూరు అశోక్, ఆకుల రామకృష్ణ, రెడ్డి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల దోపిడీ అరికట్టాలి

- పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పేరుతో దోచుకుంటున్నారు !
- ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభుడు పాశం వెంకటేష్
- ఎఐఎస్ఎఫ్ నాయకుల అక్రమ అరెస్ట్‌కు తెనాలిలో నిరసన





నిరసన తెలియజేస్తున్న నాయకులు

**తెనాలిఅర్బన్:** శ్రీచైతన్య, నారాయణ, భాష్యం తదితర కార్పొరేట్ విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పేరుతో విద్యార్థులను దోచుకుంటున్నారని, విద్యా దోపిడీని అధికారులు అడ్డుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభులు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. విజయవాడలోని శ్రీచైతన్య కళాశాల వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం తెనాలిలోని శ్రీచైతన్య కళాశాల వద్ద నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాదోపిడీని అరికట్టాలని కోరుతున్న తమ నాయకులపై పోలీసులు కేసులు పెట్టటం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు జరగటం దురదృష్టకరమన్నారు. పోలీసు కేసులకు బయపడేది లేదని దోపిడీ ఆగే వరకు పోరాటాలు చేస్తునే ఉంటామని హెచ్చరించారు. నాయకులు మద్దినేని కిరణ్ బాబు మాట్లాడుతూ కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిని ప్రశ్నించిన సంఘాలపై దాడులు చేయటం, కేసులు పెట్టటం సాధారణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్న విద్యాశాఖ అధికారులు నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తుండటం బాధాకరమన్నారు.

విద్యార్థి సంఘాలపై జరుగుతున్న దాడులు ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుండు శివ, నాయకులు పొన్నెకంటి శోభిత్, పవన్, బాలాజీ, అజయ్, చైతన్య, ఆకాష్, లోకేష్, కృష్ణ, మణి, దుర్గ, యశ్వంత్, సంజయ్ పాల్గొన్నారు.

## నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న పసుపు ట్రేడర్స్ నాయకులు

**దుగ్గిరాల:** దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో గతేడాది జరిగిన అగ్ని ప్రమాదంలో బాధిత రైతులతో పాటు వ్యాపారులకు(ట్రేడర్స్) కూడా నష్ట పరిహారం అందించాలని పసుపు ట్రేడర్స్ నాయకులు కోరారు. దుగ్గిరాలలో బుధవారం పసుపు మార్కెట్ యార్డు సెక్రెటరీ జేవీ సుబ్బారావుకు ఈ సందర్భంగా వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ.. 2024 జూలై 10న రాష్ట్ర మార్కెట్ ఫెడ్ ప్రధాన కార్యాలయం విజయవాడలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం, పసుపు రైతులు, వ్యాపారులు, ఇన్సూరెన్స్ ప్రతినిధుల సమక్షంలో జరిగిన సమావేశంలో క్వింటాకు రూ.7 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించే విధంగా ఒప్పందం కుదురిందని అన్నారు. ఒప్పందం ప్రకారం పరిహారం ప్రభుత్వం ముందు రైతులకు చెల్లించి.. తరువాత వ్యాపారులకి చెల్లించేట్లు భావిస్తోందని తెలిపారు. ప్రమాదంలో 14 మంది వ్యాపారులు 25 వేల బస్తాలను నష్టపోయారని.. రైతులతో పాటు తమకూ పరిహారం ఇవ్వాలని అన్నారు. ఇటీవల గుంటూరు కలెక్టర్, తెనాలి సబ్ కలెక్టరుకు సమస్యపై వినతిపత్రం ఇవ్వగా అది పరిశీలనకు వచ్చిందన్నారు. విచారణ నిమిత్తం పసుపు యార్డు సెక్రెటరీకు రాగా వారికి సమస్యను వివరించి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు ట్రేడర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, టి.ప్రసాద్, డి.నాగార్జున, పి.రంగయ్య, పి.దేవేందర్‌నాథ్ పాల్గొన్నారు.

## సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలి

ఎంపీపీ పద్మావతి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

**కొల్లిపర:** అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం సభా ప్రాంగణంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదటగా ప్రభుత్వశాఖల వారీగా అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. రానున్న కాలం వర్షాలు అధికంగా ఉంటాయి అని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో ముందస్తుగా మురుగు నీరు బయటకు పోయేందుకు పక్కా మురుగు కాల్వలు తీయాలని పలువురు సర్పంచ్‌లు ఎంపీటీసీలు కోరారు. ఏవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు పంట నమోదు, ఈకేవైసీ వ్యవసాయ సిబ్బంది వద్దకు తగిన పత్రాలు తీసుకువెళ్లి నమోదు చేసుకోవాలని, సబ్సిడీ పై వరి విత్తనాలు కావల్సిన వారు ముందుగా సమాచారం అందిస్తే వాటిని ఏర్పాటు చేయడానికి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. జింక్ కావాలని ఎంపీటీసీలు వ్యవసాయాధికారిని కోరగా ఆయన మాట్లాడుతూ జింక్ కావాలని రైతులు అడుగుతున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి 10 రోజులలో అందించేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.విజయలక్ష్మి, తహసీల్దారు జి.సిద్దార్థ, మండల ఉపాధ్యక్షులు 1,2 బొల్లిముంత పోతురాజు, పరిపాలనాధికారి వి.ప్రతాపరెడ్డి, ఈవోపీఆర్డీ బార్గవ్, ఎస్ఏ బి.శ్రీనివాసమూర్తి, సిబ్బంది హైమావతి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### పంట పొలంలో మహిళపై దాడి



స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రజని, సునీల్‌కుమార్

**తెనాలి:** తమ పంట భూమిలో దుక్కి దున్నించడానికి వెళ్లిన ఇరువురిపై దాడి జరిగిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అమృతలూరు మండల పరిధిలోని మూల్పూరులో తెనాలికి చెందిన వేములపల్లి రజని, తన సోదరుడి కుమారుడు వెనిగళ్ల సునీల్ కుమార్‌లతో కలసి పొలంలో దుక్కి పనులకు వెళ్లారు. అయితే మూల్పూరుకు చెందిన యలవర్తి భూషయ్య, మరికొందరు తమపై దాడికి దిగి హత్యాయత్నం చేశారని ఆరోపిస్తూ తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. అనంతరం తమ పై జరిగిన దాడి ఘటనపై తెనాలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని బాధితులు కోరారు. అయితే ఆస్తి వ్యవహారాల్లో ఏర్పడ్డ పేచీల వల్ల ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం.

### బాంబు దాడులు విరమించాలి

**దుగ్గిరాల:** గాజా పాలస్తీనాపై ఇజ్రాయిలు చేసే బాంబు దాడులను వ్యతిరేకిస్తూ బుధవారం జెండా చెట్టు వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మిక నాయకులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ.. ఇజ్రాయిలు అమెరికా అండతో గాజా పాలస్తీనాపై బాంబు దాడులు చేసి పిల్లలను సైతం చంపుతున్నారని విమర్శించారు. అంతర్జాతీయ నిబంధనను కూడా ఉల్లంఘించి ప్రజల ప్రాణాలను తీస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ సుభాని, జి.శ్రీనివాసరావు, వై.బ్రహ్మేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలు

**మంగళగిరి:** రోడ్డు ప్రమాదంలో నలుగురు స్వల్పంగా గాయపడిన ఘటన నగర పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట కాజ పరిధిలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు ద్విచక్రవాహనాలపై ఉన్న నలుగురు కింద పడి స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారికి వెంటనే ఆసుపత్రికి తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

**మేడికొండూరు:** రోడ్డుపై ఎదురెదురుగా వెళుతున్న ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పేరేచర్ల రోడ్డులోని లక్ష్మీనరసింహా కాలనీ వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా మాచవరానికి చెందిన జి.మణికంఠ ద్విచక్ర వాహనంపై గుంటూరు నుంచి సత్తెనపల్లి వైపు వెళుతున్నాడు. మేడికొండూరు నుంచి గుంటూరు వైపు ప్రయాణికులతో వెళుతున్న ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సహాయంతో క్షతగాత్రుడిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

### మోటూరికి ఘన నివాళి

**ఫిరంగిపురం:** మండలంలోని పొనుగుపాడు గ్రామంలో మోటూరి హనుమంతురావు 24వ వర్ధంతిని బుధవారం సీపీఎం నాయకులను నిర్వహించారు. హనుమంతురావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ప్రజలకు చేసిన సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో కొంగర రాఘవయ్య, మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, జి.వేంకటేశ్వరరావు, కె.వెంకటరావు, కె.కోటేశ్వరరావు, జి.నతానియేలు పాల్గొన్నారు.

### ఇప్పటంలో కమిషనర్ విస్తృత పర్యటన

**తాడేపల్లి రూరల్:** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటంలో రూ.5 లక్షల వ్యయంతో చెరువు చుట్టూ రహదారి నిర్మిస్తున్నామని అన్నారు. ఇప్పటం ప్రధాన రహదారిలో వాహనాల వేగ నియంత్రణ కోసం అక్కడి ప్రజలు స్పీడ్ బ్రేకర్లు వేయమని కోరారని, వాటిని కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరులో తాగునీటి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఏఈ రామమోహనరావు, డీఈ రాము, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యను తక్షణం పరిష్కరించాలి

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు బుధవారం నాటికి 197వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో షేక్ సుభాని, గురవయ్య, సుబ్బారావు, పిచ్చయ్య, బి.సూర్యప్రకాశరావు, ఆరిఫ్, ఇమాంబీ, శారద, రమణ, సారమ్మ, దుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు.